క్లుప్తంగా

భక్తి శ్రద్ధలతో కుంకుమార్చన



ప్రత్యేక అలంకరణలో రతనాల వెంకటేశ్వరస్వామి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక పాతమార్కెట్‌లోని శ్రీలలితాదేవి, రతనాల వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం స్వామి వారి జన్మనక్షత్రం శ్రవణా నక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున అమ్మవారికి విశేష అభిషేకాలు, అర్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. శ్రీదేవి భూదేవి సమేత రతనాల వెంకటేశ్వర స్వామికి పంచామృతాభిషేకం, అర్చనలు చేశారు. సాయంత్రం మహిళలు సామూహికంగా విష్ణు సహస్రనామ పారాయణం చేసి, భక్తి శ్రద్ధలతో కుంకుమార్చన నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

కనుల పండువగా శివ పార్వతుల కల్యాణం



శివపార్వతుల కల్యాణాన్ని నిర్వహిస్తున్న వేద పండితులు

మైదుకూరు : మైదుకూరులోని అమ్మవారిశాలలో ఆదివారం రాత్రి శివపార్వతుల కల్యాణం కనుల పండవగా నిర్వహించారు. అమ్మవారిశాలలో ఆదివారం నుంచి శుక్రవారం వరకు నిర్వహించ తలపెట్టిన మహా కుంభాభిషేక మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా ఉదయం గోపూజ, గణపతి పూజ నిర్వహించారు. రాత్రి వేద పండితులు శివపార్వతుల కల్యాణం వైభవంగా జరిపారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సభ అధ్యక్షుడు సూరిశెట్టి వెంకట శివప్రసాద్, శ్రీశైలం బోర్డు సభ్యురాలు మాధవిలత దంపతులు సహా ఆర్యవైశ్యులు పాల్గొని మహాదేవుని కల్యాణాన్ని వీక్షించారు.

వెదురూరులో పశు వైద్య శిబిరం



పశు వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది, జూనియర్ డాక్టర్లు

చాపాడు : మండలంలోని వెదురూరు గ్రామంలో ఆదివారం పశు సంవర్ధకశాఖ జాతీయ సేవా పథకం కింద ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. పశు వైద్యాధికారి విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో ప్రొద్దుటూరు పశువైద్య కళాశాలకు చెందిన వైద్య బృందం, జూనియర్ పశు వైద్యులు పశువులకు వైద్య పరీక్షలు చేశారు. మందులు, ఖనిజ లవణ మిశ్రమాలను అరెస్, దోమెస్ట్ కంపెనీ ఆధ్వర్యంలో ఉచితంగా పంపిణీ చేశారు. 45 పశువులకు గర్భకోశ చికిత్సలు, 70 పశువులకు సాధారణ చికిత్సలు, 500 కోళ్లకు తెగులు నివారణ మందులు వేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ సేవా పథకం అధికారులు పి.కళ్యాణి, ప్రశాంత్, సాయి దిలీప్, క్లినికల్ విభాగం ఆచార్యులు జ్యోతి, రేవతి తదితరులు పాల్గొన్నారు.

గిడుగు రామమూర్తికి ఘన నివాళి



గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఒంటేరు శ్రీనివాసులరెడ్డి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక ఉపాధ్యాయ సేవా కేంద్రంలో ఆదివారం గిడుగు రామమూర్తి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా తెలుగు భాషా పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో వ్యావహారిక భాషోద్యమానికి మూలపురుషుడు గిడుగు అని తెలిపారు. గ్రాంధిక భాషలో ఉన్న తెలుగు వచనాన్ని ప్రజల వాడుక భాషలోకి తీసుకొచ్చిన మహనీయుడు గిడుగు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో భాషోపాధ్యాయ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు అంకాల్ కొండయ్య, కోశాధికారి బోగా గంగాధర్, ఉపాధ్యాయులు సురేష్, వెంకటప్రసాద్, రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తల్లో జోష్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తదితరులు



పాల్గొన్న సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వైఎస్సార్‌సీపీ నాయకులు

ప్రొద్దుటూరు : రాష్ట్రంలో 175 అసెంబ్లీ స్థానాలకు 175 కొట్టాల్సిందే, జగనన్న మాట నిలబెట్టాల్సిందే అనే నినాదంతో ప్రొద్దుటూరు ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఆదివారం నిర్వహించిన సభ వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ కార్యకర్తల్లో జోష్ నింపింది. అందరికంటే ముందుగా సచివాలయ కన్వీనర్లు, గృహ సారథుల ఎంపికను పూర్తి చేసి వీరితోపాటు వలంటీర్లు, పార్టీ ప్రజాప్రతినిధులు, క్రియాశీలక కార్యకర్తలతో తొలిమారు భారీ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ ప్రముఖులు చేసిన ప్రసంగం అందరిలో ఉత్సాహం నింపింది. ముఖ్యమంత్రి జగన్ ఆదేశాల మేరకు మిగతా నియోజకవర్గాలకంటే ముందుగా గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించడం, కన్వీనర్లు, గృహ సారథుల ఎంపికను పూర్తి చేసి తొలి మారు ఇలాంటి సభను నిర్వహించడం పట్ల ఎమ్మెల్యేను అభినందించారు. ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి మాట్లాడుతూ తన ఊపిరి ఉన్నంత వరకు ప్రొద్దుటూరు నియోజకవర్గంలో టీడీపీ జెండా ఎగరనివ్వనని తెలిపారు. పాలిచ్చే ఆవును కాదని తన్నే దున్నపోతును తెచ్చుకుంటారా అని ఎమ్మెల్యే చేసిన ప్రసంగం విశేషంగా ఆకట్టుకుంది.

సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి, ప్రొద్దుటూరు ఎంపీపీ సానబోయిన శేఖర్ యాదవ్, రాజుపాళెం వైస్ ఎంపీపీ నారాయణరెడ్డి, రాజుపాళెం జెడ్పీటీసీ అంజనీకుమారి, ప్రొద్దుటూరు, రాజుపాళెం మండల కన్వీనర్లు మార్తల ఓబుళరెడ్డి, గుద్దేటి రాజారాంరెడ్డి, ప్రొద్దుటూరు, రాజుపాళెం కన్వీనర్ల ఇన్‌చార్జిలు కల్లూరు నాగేంద్రారెడ్డి, వెలవలి రాజశేఖరెడ్డి, కాకర్ల నాగేశ్వరెడ్డి, పోసా భాస్కర్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, పట్టణాధ్యక్షులు కామిశెట్టి బాబు, కోనేటి సునంద, చౌడూరు బోరెడ్డి, నియోజకవర్గ యూత్ ఇన్‌చార్జి సానపురెడ్డి ప్రతాప్‌రెడ్డి, సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, టౌన్ బ్యాంకు చైర్మన్ కుమార్‌రెడ్డి, టీటీడీ పాలకమండలి సభ్యుడు టంగుటూరు మారుతి ప్రసాద్, కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ రాత పరీక్షకు 11,362 మంది హాజరు

985 మంది గైర్హాజరు



చాపాడు: సీబీఐటీ పరీక్షా కేంద్రం వద్ద డీఎస్పీ, రూరల్ సీఐతో మాట్లాడుతున్న ఎస్పీ అన్బురాజన్

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరులో ఆదివారం నిర్వహించిన కానిస్టేబుల్ రాత పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ఇక్కడ 23 సెంటర్లలో పరీక్షలను నిర్వహించారు. 12,347 మంది అభ్యర్థులకు గాను 11,362 మంది హాజరయ్యారు. 985 మంది గైర్హాజరైనట్లు అధికారులు వెల్లడించారు. ఉదయం 10 గంటలకు పరీక్షలు ప్రారంభం కావాల్సి ఉండగా ఉదయం 8.30 గంటలకే పరీక్షా కేంద్రాల వద్ద అభ్యర్థులు బారులు తీరి నిల్చున్నారు. ఎస్పీ అన్బురాజన్ ఎస్వీఎస్ఆర్ కాలేజి, గోపీకృష్ణ సెంట్రల్ స్కూళ్లలోని పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. అడిషనల్ ఎస్పీ తుషార్ డూడీ, ప్రొద్దుటూరు ఏఎస్పీ ప్రేరణాకుమార్ పరీక్షా కేంద్రాలను పర్యవేక్షించారు. జిల్లాలోని ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన అభ్యర్థులతో ఆటోలు, బస్సులు కిటకిట లాడాయి. హోటళ్లు కూడా రద్దీగా కనిపించాయి.

సీబీఐటీలో 1454 మంది హాజరు

చాపాడు : చాపాడు మండలంలోని సీబీఐటీ కాలేజీలో జరిగిన కానిస్టేబుల్ రాత పరీక్షకు 1454 మంది అభ్యర్థులు హాజరయ్యారు. పరీక్షకు 1584 మంది హాజరుకావాల్సి ఉండగా 1454 మంది హాజరయ్యారని, 33 గదుల్లో 64 మంది సిబ్బందితో పరీక్ష పకడ్బందీగా నిర్వహించినట్లు చీఫ్ సూపరింటెండెంట్ డాక్టర్ జి.శ్రీనివాసులరెడ్డి తెలిపారు. పరీక్షా కేంద్రాన్ని జిల్లా ఎస్పీ అన్బురాజన్ పరిశీలించారు. ఎస్పీ విలేకరులతో మాట్లాడుతూ పరీక్ష కేంద్రం వద్ద ఎపటిష్ట పోలీసు బందోబస్తును ఏర్పాటుచేశామన్నారు. మైదుకూరు డీఎస్పీ వంశీధర్ గౌడ్, రూరల్ సీఐ నరేంద్రరెడ్డి, ఎస్ఐ కుళ్లాయప్ప పాల్గొన్నారు.

నేడు టంగుటూరులో గడపగడపకు మన ప్రభుత్వం

రాజుపాళెం : మండలంలోని టంగుటూరు గ్రామంలో సోమవారం సాయంత్రం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకుడు ముడియం గౌతమ్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి వస్తున్నారని, మండలంలోని ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, అధికారులు పాల్గొనాలని ఆయన కోరారు.

ఫిబ్రవరి 13, 14 తేదీల్లో ఏఐఎస్ఎఫ్ జిల్లా మహాసభలు

ప్రొద్దుటూరు కల్చరల్ : ఏఐఎస్ఎఫ్ జిల్లా మహాసభలను ఫిబ్రవరి 13, 14 తేదీల్లో నిర్వహించనున్నట్లు ఏఐఎస్ఎఫ్ మాజీ జిల్లా అధ్యక్షుడు సుబ్బరాయుడు తెలిపారు. ఆదివారం సంఘం కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విభజన హామీలు, ప్రత్యేక హోదా, రాష్ట్రానికి రావాల్సిన విశ్వవిద్యాలయాలపై చర్చిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు, ఉపాధ్యక్షుడు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఆదివారం పనిచేసిన విద్యాసంస్థలపై చర్య తీసుకోవాలి

పోరుమామిళ్ల : రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం విద్యాసంస్థలకు సెలవు ప్రకటించినా పోరుమామిళ్లలో ప్రైవేటు విద్యాసంస్థలు పాఠశాలలు, కళాశాలలు నడపటంపై అధికారులు చర్య తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి వీరపోగు రవి కోరారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా తరగతులు నిర్వహిస్తున్న విద్యాసంస్థలపై ఎందుకు చర్యలు తీసుకోవడంలో లేదో అర్థం కావడం లేదన్నారు. ఈ సమావేశంలో వంశీ, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

టూవీలర్ మెకానిక్‌ల ర్యాలీ

మైదుకూరు : మైదుకూరులో ఆదివారం సాయంత్రం టూవీలర్ మెకానిక్‌లు ర్యాలీ నిర్వహించారు. టూవీలర్ మెకానిక్స్, హెల్పర్ల అసోసియేషన్ ఏర్పడి ఏడాది అయిన సందర్భంగా వారు పట్టణంలో వార్షికోత్సవ సభ నిర్వహించారు.

ఇంగ్లీష్ పుస్తకాల వితరణ

ప్రొద్దుటూరు క్రైం : ఇంగ్లిష్‌ను సులభంగా నేర్చుకునేలా రూపొందించిన మిస్టర్ కొర్రా ఇంగ్లీష్ అండ్ ఇంగ్లీష్ పుస్తకాలు పిల్లలకు బాగా ఉపయోగపడతాయని ఎన్జీఓ అసోసియేషన్ అధ్యక్షుడు కేజే రఘురామిరెడ్డి తెలిపారు. పేద పిల్లలకు ఉచితంగా పంపిణీ చేసేందుకు 1000 మిస్టర్ కొర్రా ఇంగ్లీష్ అండ్ ఇంగ్లీష్ పుస్తకాలను సంస్థవారు ఆదివారం సాయంత్రం ఎన్జీఓ అసోసియేషన్ అధ్యక్షుడికి అందజేశారు. వీటిని పేద పిల్లలకు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఎన్జీఓ అసోసియేషన్ సెక్రటరి రామసుబ్బయ్య, సహాధ్యక్షుడు సదాశివ, కార్యదర్శులు రామయ్య, సుబ్బారెడ్డి, ఇంగ్లిష్ ఫ్యాకల్టీ శివాజీ శంకర్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ఇంగ్లీష్ పుస్తకాలను ప్రదర్శిస్తున్న ఎన్జీఓ అసోసియేషన్ నాయకులు, సంస్థ ప్రతినిధులు

రాజ్యాంగ హక్కుల పరిరక్షణకు నినదించాలి



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న వక్తలు

ప్రొద్దుటూరు : రాజ్యాంగ హక్కుల పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ నినదించాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. స్థానిక ఎన్జీఓ హోంలో ఆదివారం భావ ప్రకటన స్వేచ్ఛ ఐక్య కార్యాచరణ పేరుతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న నియంతృత్వ విధానాల వల్ల పౌరులకు రాజ్యాంగం కల్పించిన హక్కులు ప్రమాదంలో పడ్డాయన్నారు. దేశంలో నేడు ఎమర్జెన్సీ పరిస్థితులు నెలకొన్నాయని, కనీసం మాట్లాడే స్వేచ్ఛ కూడా లేకుండా భావ ప్రకటనపై ఆంక్షలు పెడుతున్నారన్నారు. ప్రభుత్వాల అణచివేత విధానాలపై మౌనంగా ఉండటం మూలంగానే ప్రజాస్వామ్య వ్యవస్థ ప్రమాదంలో పడుతోందన్నారు. ఈనెల 26న రిపబ్లిక్ డే సందర్భంగా రాజ్యాంగ హక్కుల పరిరక్షణ కోసం ప్రతి పౌరరుడు నినదించాలని కోరారు. సృజన సామాజిక వేదిక కన్వీనర్ శ్రీను అధ్యక్షతన నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో దళిత సమాఖ్య అధ్యక్షుడు యల్లయ్య మాదిగ, పౌరవ హక్కుల సంఘం నాయకుడు సురేష్‌బాబు, టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు కుతుబుద్దీన్, మహిళా శక్తి కన్వీనర్ వడ్ల లక్ష్మీదేవి, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బొర్రా రామాంజనేయులు, ఆర్టీసీ మహిళా ఉద్యోగుల సంఘం ప్రతినిధి అమీనా, ఆవాజ్ అధ్యక్షుడు షరీఫ్, బీఎస్పీ అధ్యక్షుడు జయరాం, మిత్రజ్యోతి కార్యదర్శి మహమూద్, విరసం రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు వరలక్ష్మీ, చైతన్య మహిళా సంఘం కన్వీనర్ పద్మ, భారత నాస్తిక సమాజం నాయకుడు జయచంద్రారెడ్డి మాట్లాడారు.

విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేటు పరం చేయొద్దు



దీక్ష పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

ప్రొద్దుటూరు : విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేటు పరం చేయొద్దని మండలంలోని పెన్నానగర్ ఏఐటీయూసీ కార్యాలయంలో ఆదివారం దీక్ష పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పి.సుబ్బరాయుడు మాట్లాడుతూ విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ వేల కోట్ల రూపాయల లాభాలతో నడుస్తోందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రైవేటుపరం చేసేందుకు కుట్రపన్నుతుంటే రాష్ట్ర ప్రభుత్వం ఆ కుట్రలో భాగస్వామ్యం కావడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. ఈ నెల 23, 24 తేదీల్లో విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేటు పరం చేయొద్దని సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో రెవెన్యూ డివిజన్ కార్యాలయాల ఎదుట దీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 30న ఛలో విశాఖ కార్యక్రమం చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు హరి, రూబెన్, శ్రీనివాసులరెడ్డి, చంద్రారెడ్డి, శారదమ్మ, రమీజ, రజని పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు పరిశ్రమను కాపాడుకుందాం

పోరుమామిళ్ల: బలిదానాలు, త్యాగాలు, నాయకుల రాజీనామాలతో సాధించుకున్న విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ కాకుండా అడ్డుకునేందుకు ప్రజలందరూ సిద్ధం కావాలని సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు కోరారు. ఆదివారం పోరుమామిళ్లలో ఏఐటీయూసీ, సీపీఐల ఆధ్వర్యంలో వాల్‌పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పిడుగు మస్తాన్ మాట్లాడుతూ కార్పొరేట్ కంపెనీలకు లాభాలు చేకూర్చడానికి బీజేపీ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను తిప్పికొట్టేందుకు ఈనెల 27న విశాఖలో లక్షమందితో కార్మిక మహాగర్జన జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ, సీపీఐ నేతలు రవి, కేశవ, మస్తాన్, ఫిరోజ్, వెంకటేశ్వర్లు, బెల్లం బాషా తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమి పూజ



భూమిపూజ కార్యక్రమంలో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక వైఎంఆర్ కాలనీలోని అవధూత కృష్ణయ్య స్వామి ఆలయం నిర్మాణానికి ఆదివారం ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి భూమి పూజ చేశారు. ఆలయ నిర్మాణానికి తన వంతు సహాయం అందిస్తానని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను ఆలయ కమిటీ ప్రతినిధులు శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, కౌన్సిలర్ వరికూటి ఓబుళరెడ్డి, బీజేపీ సీనియర్ నాయకుడు నాయకుడు జెల్లి మధుసూదన్, ఆలయ కమిటీ ప్రతినిధులు, కృష్ణయ్య స్వామి భక్తులు పాల్గొన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడపడం ప్రమాదకరం

బద్వేలు అర్బన్ : మద్యం సేవించి వాహనాలు నడపడం ప్రమాదకరమని బద్వేలు మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ వి.శేఖర్‌రావు పేర్కొన్నారు. 34వ జాతీయ రహదారి భద్రత వారోత్సవాల్లో భాగంగా ఆదివారం బద్వేలు – మైదుకూరు జాతీయ రహదారిలో డ్రంక్‌అండ్‌డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు ప్రధానంగా మద్యం సేవించి వాహనాలను నడపడం వల్లే జరుగుతున్నట్లు తేలిందన్నారు. ప్రజలు, వాహన డ్రైవర్లు విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. ఎంవీఐ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో సోమవారం అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నారు. వేకువజామున సుప్రభాత సేవ మొదలుకుని విశేష అభిషేకాలు, అర్చనలతో పాటు గణపతి, నవగ్రహ, రుద్ర, చండీ హోమాలను చేయనున్నారు. సాయంత్రం 5 గంటలకు పుష్పాభిషేకం, 102 మంది ఆర్యవైశ్య మహిళలతో లక్ష కుంకుమార్చన నిర్వహించనున్నారు. విశేషంగా అమ్మవారిని వజ్రకిరీటంతో అలంకరించనున్నారు. భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని ఆర్యవైశ్యసభ అధ్యక్షుడు బుశెట్టి రాంమోహన్‌రావు కోరారు.

ఆధ్యాత్మిక చింతన పెంపొందించుకోవాలి



మాట్లాడుతున్న శ్రీరామ చైతన్య స్వామి

ప్రొద్దుటూరు కల్చరల్ : ప్రతి ఒక్కరూ ఆధ్మాతిక చింతనను పెంపొందించుకోవాలని బ్రహ్మశ్రీ శ్రీరామ చైతన్య స్వామి పేర్కొన్నారు. స్థానిక వెంకటేశ్వర్లపేటలోని స్వారాజ్య ఆశ్రమంలో 81వ వార్షికోత్సవాల సందర్భంగా ఆధ్యాత్మిక ప్రసంగాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ధ్యానం చేయాలని సూచించారు. ఉపనిషత్తులను ప్రవచించారు. స్వారాజ్య ఆశ్రమ నూతన కమిటీ అధ్యక్షుడుగా వద్ది నరసింహులు వరుసగా రెండోసారి ఎన్నికయ్యారు. కార్యనిర్వాహక అధ్యక్షులుగా శ్రీరామ చైతన్యస్వామి, ఉపాధ్యక్షులుగా రత్నమ్మ, ఉమాసుదర్శన్, ప్రధాన కార్యదర్శిగా మచ్చా ప్రభాకర్, కార్యదర్శిగా గుర్రం శివకుమార్, సహాయ కార్యదర్శులుగా శివ, గౌరవాధ్యక్షులుగా శివానందస్వామి, కృష్ణ చైతన్య స్వామి, గౌరవ సలహాదారులుగా అంబటి కృష్ణారెడ్డి, సాధు గోపాలకృష్ణ, సభ్యులుగా రేణుక, జ్యోతి, శ్రీనివాస్, మూలాదేవి, చెంద్రాయుడు, చెన్నా చంద్రబాబులను ఎన్నుకున్నారు. ఆశ్రమాభివృద్ధికి కృషి చేస్తామని వారు తెలిపారు.

ఐక్యతతో అవకాశాలను అందిపుచ్చుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న యాదవ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ రమేష్‌యాదవ్

బద్వేలు అర్బన్ : యాదవ యువత ఐక్యతతో అవకాశాలను అందిపుచ్చుకుని ముందుకు సాగాలని యాదవ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కావేటిరమేష్‌యాదవ్ పేర్కొన్నారు. స్థానిక ఎన్‌జీఓ హోంలో ఆదివారం అఖిలభారత యాదవ మహా సంఘం ఆధ్వర్యంలో బద్వేలు, గోపవరం, అట్లూరు మండలాల యాదవ యువత సమావేశంలో ఆయన మాట్లాడుతూ యాదవ యువత కలిసి కట్టుగా పరస్పర సహకారంతో అన్ని రంగాల్లో రాణించాలని కోరారు. సమావేశం అనంతరం యాదవ యువత నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఇందులో నియోజకవర్గ అధ్యక్షుడిగా దొండపాటి రమణయాదవ్, బద్వేలు మండల అధ్యక్షుడిగా దూళ్ల రమేష్‌యాదవ్, మున్సిపాలిటీ అధ్యక్షుడిగా చంద్రయాదవ్‌లను ఎన్నుకున్నారు. సమావేశంలో యాదవ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌యాదవ్, యాదవ సంఘం సీనియర్ నాయకులు వెంకటరత్నం, మానంశివ, మచ్చా సుబ్బారావు, నాగేంద్ర, మహేష్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

చియ్యపాడు చెన్నకేశవ స్వామి

ఆలయ పునర్నిర్మాణానికి రూ.లక్ష వితరణ



చియ్యపాడు చెన్నకేశవ స్వామి ఆలయ చైర్మన్‌కు నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

చాపాడు : మండలంలోని చియ్యపాడు గ్రామంలో గల పురాతన దేవాలయమైన శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయ పునర్నిర్మాణ అభివృద్ధి కోసం మైదుకూరు నియోజకవర్గ శాసనసభ్యులు శెట్టిపల్లె రఘురామిరెడ్డి రూ.లక్ష నగదును ఆదివారం ఆలయ చైర్మన్ నిరంజన్‌రెడ్డికి అందజేశారు. ఇటీవల జరిగిన ఆలయ పాలక మండలి ప్రమాణ స్వీకారం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆలయ అభివృద్ధి కోసం రూ.లక్ష ఇవ్వనున్నట్లు ప్రజల సమక్షంలో హామీ ఇచ్చారు. ఈ మేరకు ఆలయ చైర్మన్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శిథిలావస్థకు చేరిన ఈ ఆలయ పునర్నిర్మాణం చేపట్టే క్రమంలో గ్రామస్తుల కోరిక మేరకు ప్రభుత్వం నుంచి పూర్తి సహాయసహకారాలు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైస్సార్‌సీపీ నాయకులు కాత్యాయని కన్‌స్ట్రక్షన్స్ ఎండీ పీవీ రమణారెడ్డి, కోదండ రామాలయ చైర్మన్ రామకృష్ణారెడ్డి, గ్రామ సర్పంచ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు భూములు చూపాలి



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు జి.శివకుమార్

బ్రహ్మంగారిమఠం: మండలంలో భూమిలేని నిరుపేదలకు నాటి వైఎస్సార్ ప్రభుత్వంలో ఇచ్చిన భూములకు ఇంతవరకు భూములు చూపలేదని సీపీఎం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జి.శివకుమార్ తెలిపారు. ఆదివారం బి.మఠంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 2006–2007 సంవత్సరంలో జరిపిన అసైన్‌మెంట్ కమిటీలో సోమిరెడ్డిపల్లె, మద్దిరెడ్డిపల్లె, నరసన్నపల్లె, పలుగురాళ్లపల్లె, కొండువారుపల్లె, రవీంద్రనగర్, బి.మఠం గ్రామాల నిరుపేదలకు ప్రతి కుటుంబానికి 1.50 ఎకరాలు భూములకు సంబంధించి డి పట్టా ఇచ్చారు. ఇంతవరకు డి పట్టా పొందిన నిరుపేదలకు భూములు ఎక్కడ ఉన్నాయి అనేది చూపడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయకార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యుడు గోవింద్, మండల నాయకులు రమణయ్య, భాస్కర్, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనం



కలసపాడు : మండల కేంద్రమైన కలసపాడులోని ఎస్‌కె జూనియర్ కళాశాల ఆవరణలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. 1997–98 సంవత్సరంలో జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదివిన 127 మంది విద్యార్థుల్లో 80 మంది ఆదివారం ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం జరుపుకున్నారు. ముందుగా సర్వేపల్లిరాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమం అనంతరం నాటి గురువులను విద్యార్థులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉపాధ్యాయులు శ్రీరాములు, మాల కొండయ్య, కొండయ్య, ఆర్.సుబ్బారెడ్డి, యేసుదాసు, సిద్దయ్య, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

సంఘీభావంతో వివాహ పరిచయాలు



మాట్లాడుతున్న జీవీఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు జీవీ రమణ

మైదుకూరు : అందరి సహకారం, సంఘీభావంతోనే ఏ కమ్యూనిటీలోనైనా వివాహ పరిచయాలు జరుగుతాయని జీవీఆర్ ఫౌండేషన్ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు జీవీ రమణ అన్నారు. ఆదివారం మైదుకూరు డీసీఎల్ కల్యాణ మండపంలో బలిజ వధూవరుల ఉచిత వివాహ పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతి, కర్నూలు, అనంతపురం, అన్నమయ్య, చిత్తూరు, వైఎస్సార్ జిల్లాల నుంచి వచ్చిన వధూవరుల తల్లిదండ్రులకు జీవీ రమణ కౌన్సిలింగ్ నిర్వహించారు. మైదుకూరు మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర మాట్లాడుతూ తరచూ ఇలాంటి పరిచయ కార్యక్రమాలు జరగడం వల్ల పేద మధ్యతరగతి కుటుంబాల వారి పిల్లల వివాహాలు త్వరితగతిన జరుగుతాయన్నారు. బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ మాచనూరు సుబ్బరాయుడు పాల్గొన్నారు.